

శివ్వంపేటలో ఘనంగా **02**
80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు



# సంగారెడ్డి మెదక్

ఆదివారం 16 ఆగస్టు 2026 www. praja jyothi news.com పేజీలు:10




## రేషన్ కార్డు కేవలం కాగితం కాదు..
# పేదల ఆకలి తీర్చే ఆత్మగౌరవం

- పేదల సంక్షేమమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

**02**



# రూ.20 కోట్లతో కోల్డ్ స్టోరేజ్‌కు భూమిపూజ

- రైతులకు ఎంతో ప్రయోజనం.. మంత్రి వివేక్ వెంకటస్వామి **02**

# రేషన్ కార్డు కేవలం కాగితం కాదు.. పేదల ఆకలి తీర్చే ఆత్మగౌరవం

మొదటిపేజీ తరువాయి

సంగారెడ్డి ప్రజా జ్యోతి ప్రతినిధి ఆగస్టు 15:-

స్మార్ట్ రేషన్ కార్డు కేవలం ఒక కాగితం కాదని, పేదల ఆకలి తీర్చే ఆత్మగౌరవానికి ప్రతీక అని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అన్నారు. శనివారం సంగారెడ్డి లోని అంబేద్కర్ స్టేడియం గ్రౌండ్స్ లో నిర్వహించిన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో ముఖ్యమంత్రి పాల్గొని లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలకు నిత్యావసర సరుకులు అందించేందుకు రేషన్ షాపులను ఏర్పాటు చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని అన్నారు.ఇందిరమ్మ రాజ్యంలో ఏ ఒక్క పేదవాడు ఆకలితో అలమటించకూడదన్నదే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. రాష్ట్రంలోని ప్రతి పేద కుటుంబానికి నాణ్యమైన సన్నబియ్యం అందిస్తున్నామని తెలిపారు. సన్నబియ్యం, ఇందిరమ్మ ఇళ్లు, ఆరోగ్యశ్రీ వంటి సంక్షేమ కార్యక్రమాలపై ప్రతిపక్షాలు మాట్లాడుతున్నాయని, అయితే పేదల సంక్షేమం కోసం గతంలో వారు ఏం చేశారో ప్రజలు ఆలోచించాలని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే కరెంటు ఉండదని గతంలో విమర్శలు చేసిన వారు ఇప్పుడు వాస్తవాలను చూడాలని అన్నారు. రాష్ట్రంలో రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్ అందిస్తున్నామని పేర్కొన్నారు. సన్నధాన్యం సాగును ప్రోత్సహించేందుకు క్వింటాల్‌కు రూ.500/- బోనస్ అందిస్తున్నామని తెలిపారు. రైతు భరోసా మొత్తాన్ని పెంచి ఏడాదికి రూ.12 వేల చొప్పున అందిస్తున్నామని, ఇప్పటివరకు రూ.36 వేల కోట్లను రైతుల ఖాతాల్లో జమ చేశామని చెప్పారు.రైతులకు రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేసి దేశంలో ఎక్కడా లేని విధంగా రూ.21 వేల కోట్లు ఖర్చు చేశామని ముఖ్యమంత్రి తెలిపారు. గత 32 నెలల్లో రైతులు పండించిన ధాన్యానికి సంబంధించి రూ.90 వేల కోట్లను రైతుల ఖాతాలకు బదిలీ చేశామని చెప్పారు. రెండున్నరేళ్లలో రైతుల కోసం మొత్తం రూ.1.70 లక్షల కోట్లు ఖర్చు చేశామని పేర్కొన్నారు.ప్రతి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్లు,డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పేరుతో గత ప్రభుత్వం ఇచ్చిన హామీలకు భిన్నంగా తమ ప్రభుత్వం రెండేళ్లలో సుమారు 7 లక్షల ఇళ్లను మంజూరు చేసిందని ముఖ్యమంత్రి తెలిపారు. రాష్ట్రంలోని ప్రతి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం జరుగుతోందని, ఇందిరమ్మ ఇల్లు లేని గ్రామం తెలంగాణలో ఉండకూడదన్నదే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు.ఒంటరి మహిళలు, చేనేత, గీత కార్మికులకు పెన్షన్లు అందించే బాధ్యత ప్రభుత్వానిదేనని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరూ దరఖాస్తు చేసుకోవాలని, అర్హత ఉన్న వారికి పెన్షన్లు అందిస్తామని చెప్పారు.రెండున్నరేళ్లలో 72 వేల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేశామని, మరో 10 వేల ఉద్యోగాలకు నోటిఫికేషన్లు జారీ చేశామని ముఖ్యమంత్రి తెలిపారు. ప్రతి ఆరు నెలలకు ఉద్యోగ ఖాళీలను గుర్తించి భర్తీ చేసే విధంగా చర్యలు తీసుకుంటామని అన్నారు. నిరుద్యోగ యువత మాయమాటలకు లోనుకాకుండా పోటీ పరీక్షలకు సిద్ధం కావాలని సూచించారు.ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని, విధ్వంసానికి గురైన రాష్ట్రాన్ని అభివృద్ధి, సంక్షేమం వైపు నడిపిస్తూ ముందుకు సాగుతున్నామని ముఖ్యమంత్రి అన్నారు. ప్రజల ఆశీర్వాదం తమ ప్రభుత్వానికి కొనసాగాలని కోరారు.సంగారెడ్డిలో జగ్గారెడ్డి పోటీ చేయాలా వద్దా అన్నది ఆయన ఒక్కరి నిర్ణయం కాదని, కాంగ్రెస్ అగ్ర నాయకత్వం నిర్ణయిస్తుందని ముఖ్యమంత్రి అన్నారు. రాహుల్ గాంధీతో జగ్గారెడ్డికి ఉన్న అనుబంధాన్ని రాముడుహనుమంతుడి సంబంధంతో పోల్చారు. ఎన్నికల్లో ఓడిపోయినప్పటికీ ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల కోసం పనిచేస్తున్న జగ్గారెడ్డి వంటి నాయకుడు ప్రజా జీవితంలో ఉండాల్సిన అవసరం ఉందని, ఆయనకు ప్రజలు అండగా నిలవాలని కోరారు.రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ మాట్లాడుతూ 1980లో మెదక్ జిల్లా ప్రజలు ఇందిరాగాంధీకి బ్రహ్మరథం పట్టారని గుర్తు చేశారు. ఇందిరాగాంధీ హయాంలోనే ఈ ప్రాంతాన్ని పారిశ్రామికంగా అభివృద్ధి చేసేందుకు పునాది పడిందన్నారు. పేదలకు ఇళ్ల స్థలాలు కల్పించడంలో ఇందిరాగాంధీ కీలక పాత్ర పోషించారని కొనియాడారు.మహిళా సాధికారతలో భాగంగా కోటి మంది మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసి కోటీశ్వరులుగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. విద్య, వైద్య రంగాల్లో అనేక సంస్కరణలకు శ్రీకారం చుట్టామని అన్నారు. ఆరోగ్యశ్రీ పరిమితిని ఐదు లక్షల నుంచి పది లక్షలకు పెంచిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని చెప్పారు.సంగారెడ్డి జిల్లాలోని సింగూరు ప్రాజెక్టును పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రిని మంత్రి కోరారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో ఎస్సీ వర్గీకరణ ప్రక్రియ ముందుకు సాగిందని, ప్రతి నియోజకవర్గానికి 3,500 ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసినట్లు తెలిపారు. తెలంగాణను అన్ని రంగాల్లో మరింత అభివృద్ధి చేయాలన్న దిశగా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు.రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ఆగస్టు 15 తెలంగాణ చరిత్రలో ఒక ప్రత్యేకమైన రోజుగా నిలిచిపోతుందని అన్నారు. గత ప్రభుత్వం పదేళ్లపాటు కొత్త రేషన్ కార్డులు మంజూరు చేయలేదని, ప్రస్తుత ప్రభుత్వం అర్హులైన నిరుపేదలకు రేషన్ కార్డులు అందించేందుకు విప్లవాత్మక నిర్ణయాలు తీసుకుందని తెలిపారు.రాష్ట్రంలో సుమారు 3.42 కోట్ల మంది లబ్ధిదారులకు 1.06 కోట్ల రేషన్ కార్డులు అందిస్తున్నామని చెప్పారు. రేషన్ కార్డులోని ప్రతి కుటుంబ సభ్యునికి నెలకు 6 కిలోల చొప్పున ఉచితంగా నాణ్యమైన సన్నబియ్యం అందిస్తున్నామని తెలిపారు. రేషన్ కార్డు మంజూరు ప్రక్రియ నిరంతర ప్రక్రియ అని, అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి రేషన్ కార్డు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు.జిల్లా ఇన్‌చార్జి మంత్రి వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా సన్నధాన్యం పండించే రైతులను ప్రోత్సహించేందుకు బోనస్ అందిస్తున్నామని తెలిపారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు సన్నధాన్యానికి బోనస్ చెల్లిస్తూ రైతులను ఆదుకుంటున్నది కాంగ్రెస్ ప్రభుత్వమేనన్నారు.యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని, అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన టెక్నాలజీ సెంటర్ల ఏర్పాటుకు చర్యలు చేపట్టామని తెలిపారు. టామ్‌టామ్ వంటి సంస్థల ద్వారా నిరుద్యోగ యువతకు విదేశాల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించే దిశగా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు.ఈ కార్యక్రమంలో ఎంపీ సురేష్ షెట్కార్, శాసనసభ్యులు సంజీవరెడ్డి, నవీన్ యాదవ్, సెట్విన్ చైర్మన్ గిరిధర్ రెడ్డి, ఫుడ్ కార్పొరేషన్ చైర్మన్, మాజీ మంత్రి ఏ. చంద్రశేఖర్, మాజీ శాసనసభ్యులు జయప్రకాశ్ రెడ్డి, నిర్మల జగ్గారెడ్డి, ఇతర ప్రజాప్రతినిధులు, జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, పౌరసరఫరాల శాఖ ఉన్నతాధికారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## రూ.20 కోట్లతో కోల్డ్ స్టోరేజ్‌కు భూమిపూజ

మొదటిపేజీ తరువాయి

శివ్వంపేట ప్రజాజ్యోతి ఆగస్టు 15:

మెదక్ జిల్లా శివ్వంపేట మండలం దంతాన్‌పల్లి గ్రామ శివారులో రూ.20 కోట్ల వ్యయంతో నిర్మించనున్న === సీడ్ కోల్డ్ స్టోరేజ్‌కు రాష్ట్ర మంత్రి వివేక్ వెంకటస్వామి భూమిపూజ చేశారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రైతులు పండించిన పంటలను పంట చేతికొచ్చిన వెంటనే తక్కువ ధరకు విక్రయించాల్సిన పరిస్థితి లేకుండా కోల్డ్ స్టోరేజ్‌లు ఎంతగానో ఉపయోగపడతాయని అన్నారు. పంటలకు మంచి ధర లభించే వరకు కోల్డ్ స్టోరేజ్‌లో నిల్వ చేసి, ధర వచ్చిన తర్వాత విక్రయించుకోవడం ద్వారా రైతులు నష్టాలను నివారించడంతో పాటు అధిక ఆదాయం పొందే అవకాశం ఉంటుందని తెలిపారు.కోల్డ్ స్టోరేజ్‌ల ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం సబ్సిడీ అందిస్తున్నప్పటికీ,ప్రస్తుత అవసరాలకు ఆ సబ్సిడీ సరిపోవడం లేదని మంత్రి పేర్కొన్నారు. దంతాన్‌పల్లి గ్రామ శివారులో కోల్డ్ స్టోరేజ్ ఏర్పాటు చేయడం ద్వారా ఈ ప్రాంత రైతులకు ఎంతో ప్రయోజనం కలగడంతో పాటు స్థానికంగా ఉద్యోగ అవకాశాలు కూడా పెరుగుతాయని అన్నారు.ఈ సందర్భంగా === కోల్డ్ స్టోరేజ్ మేనేజింగ్ డైరెక్టర్ రాకేష్‌రెడ్డిని మంత్రి అభినందించారు.ఈ ప్రాంతంలో కోల్డ్ స్టోరేజ్ ఏర్పాటు చేయడం సంతోషకరమైన విషయమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో నర్సాపూర్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి రాజిరెడ్డి,ప్రాథమిక సహకార సంఘం చైర్మన్ వెంకట్రాంరెడ్డి,వైస్ చైర్మన్ వేణుగోపాల్‌రెడ్డి,సర్పంచులు మమత,సమత,డీఎస్పీ నరేందర్,సీఐ వెంకటరాజుగౌడ్, ఎస్ఐ మధుకర్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు నాగేశ్వరరావు, జగన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## శివ్వంపేటలో ఘనంగా 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

- జాతీయ జెండాలు ఎగురవేసిన ప్రజాప్రతినిధులు,అధికారులు..
- దేశభక్తి గీతాలతో అలరించిన విద్యార్థులు

శివ్వంపేట ప్రజాజ్యోతి ఆగస్టు 15:

మొదటిపేజీ తరువాయి

మెదక్ జిల్లా శివ్వంపేట మండల కేంద్రంతో పాటు మండలవ్యాప్తంగా 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు.ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలు, గ్రామపంచాయతీ కార్యాలయాలు,వివిధ ప్రభుత్వ శాఖల కార్యాలయాల్లో జాతీయ జెండాలను ఆవిష్కరించి స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకున్నారు.శివ్వంపేట గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచ్ రాజీపేట వెంకటేశ్వర్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, అనంతరం మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకుంటూ దేశ ఐక్యత, సమగ్ర అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరూ బాధ్యతగా పనిచేయాలని పిలుపునిచ్చారు.మండల విద్యాశాఖ కార్యాలయంలో విద్యాధికారి బుచ్చా నాయక్ జాతీయ జెండాను ఎగురవేశారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు బాలచంద్రం జెండాను ఆవిష్కరించారు.విద్యార్థులు దేశభక్తి గీతాలు,ప్రసంగాలు,సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి ఆకట్టుకున్నారు.స్వాతంత్ర్య దినోత్సవం ప్రాముఖ్యతను వివరిస్తూ ఉపాధ్యాయులు విద్యార్థులకు పలు విషయాలను వివరించారు.అదేవిధంగా ఎంపీడీవో కార్యాలయం,తహసీల్దార్ కార్యాలయంతో పాటు మండలంలోని వివిధ ప్రభుత్వ శాఖల కార్యాలయాల్లో అధికారులు,సిబ్బంది జాతీయ జెండాలను ఆవిష్కరించి స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.పలు గ్రామాల్లోనూ గ్రామపంచాయతీ కార్యాలయాల వద్ద సర్పంచులు, పంచాయతీ పాలకవర్గ సభ్యులు జెండాలను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ స్వాతంత్ర్యం కోసం ప్రాణత్యాగం చేసిన మహనీయుల సేవలను ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలని,దేశ సమగ్రతను కాపాడుతూ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని కోరారు. గ్రామీణ ప్రాంతాల్లోనూ జాతీయ జెండాలతో అలంకరణలు, దేశభక్తి కార్యక్రమాలు నిర్వహించడంతో మండలవ్యాప్తంగా పండుగ వాతావరణం నెలకొంది.

# ఘనంగా 80వ స్వతంత్ర దినోత్సవ వేడుకలు...

,,- సర్పంచ్ రాము యాదవ్

**మనోహరాబాద్ ఆగస్టు 15 (ప్రజా జ్యోతి)**

మండలంలో ఘనంగా 80వ స్వతంత్ర దినోత్సవ వేడుకలు జరిగాయి. శనివారం, కొండాపూర్ గ్రామంలో సర్పంచ్ నూకల రాము యాదవ్, త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించి మహాత్మా గాంధీ చేసిన సేవలను గుర్తు చేశారు ఆయన మాట్లాడుతూ నేటి బాలల రేపటి పౌరులు చక్కగా చదువుకొని మంచి ఉద్యోగస్తులు కావాలని గాంధీజీ కలలు నెరవేర్చే విధంగా శాంతియుతంగా ఉంటూ రాజ్యాంగం రచించిన అంబేద్కర్ భగత్ సింగ్ చత్రపతి శివాజీ సర్వేపల్లి రాధాకృష్ణ ఎందరో మహానుభావులు మన దేశానికి స్వతంత్రం తెచ్చిన ఘనత వారిదేనని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సంతోష్ గ్రామ ఉప సర్పంచ్ బద్రి మాధవి వెంకటేష్ యాదవ్ వార్డు సభ్యులు రాధిక మధు యాదవ్ చాకలి సత్యనారాయణ, ( చిన్ని కృష్ణ ) టెల్ మీ భాస్కర్ యాదవ్, చింతల బాబు ముదిరాజ్, శ్రీకాంత్ యాదవ్, రేణుక శేఖర్ ముదిరాజ్, కలిపి బాలమణి ఆంజనేయులు యాదవ్, గ్రామ పెద్దలు యువకులు విద్యార్థిని విద్యార్థులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.





# అఖిల భారత పద్మశాలి ఉద్యోగుల విభాగం అధ్యక్షుడిగా తీరాందాస్ యాదగిరి

**నారాయణఖేడ్, ప్రజాజ్యోతి ఆగస్టు 15:**

అఖిల భారత పద్మశాలి ఉద్యోగుల విభాగం అధ్యక్షుడిగా తీరాందాస్ యాదగిరి ఎన్నికైన సందర్భంగా తెలంగాణ పద్మశాలి ఉద్యోగుల సంఘం ఉమ్మడి మెదక్ జిల్లా అధ్యక్షులు భాస్కర్ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఆయన ఒక ప్రకటనలో పేర్కొంటూ..పద్మశాలి ఉద్యోగుల సంక్షేమం, ఐక్యత, అభివృద్ధి కోసం తీరాందాస్ యాదగిరి నాయకత్వంలో మరింత కృషి జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఆయనకు ఈ బాధ్యత దక్కడం పద్మశాలి ఉద్యోగులందరికీ గర్వకారణమని పేర్కొన్నారు. అఖిల భారత స్థాయిలో పద్మశాలి ఉద్యోగుల సమస్యలను సమర్థవంతంగా ముందుకు తీసుకెళ్లి, వారి హక్కులు, సంక్షేమం కోసం కృషి చేయాలని ఆకాంక్షించారు. తీరాందాస్ యాదగిరి పదవీకాలం విజయవంతంగా సాగాలని శుభాకాంక్షలు తెలిపారు.



# స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో గ్రామ పాలకవర్గానికి అవమానం!

- గ్రామ పాలకవర్గాన్ని అవమానించారంటూ హెచ్ఎంపై గ్రామస్తుల ఆగ్రహం..
- అధికారులకు ఫిర్యాదు చేస్తామని వెల్లడి,,

**శివ్వంపేట ప్రజాజ్యోతి ఆగస్టు 15:**

శివ్వంపేట మండలం నవాబుపేట గ్రామంలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో గ్రామ పాలకవర్గం, గ్రామ పెద్దలకు తగిన గౌరవం ఇవ్వలేదని ఆరోపిస్తూ నవాబు పేట గ్రామస్తులు పాఠశాల హెచ్ఎం బాబా పై ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశవ్యాప్తంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నప్పటికీ, గ్రామంలోని పాఠశాలలో మాత్రం కనీసం వేదిక ఏర్పాటు చేయకుండా కార్యక్రమాన్ని నిర్వహించడం పట్ల గ్రామస్తులు అభ్యంతరం వ్యక్తం చేశారు.గ్రామ సర్పంచ్,ఉపసర్పంచ్, వార్డు సభ్యులు,గ్రామ పెద్దలను జెండా ఆవిష్కరణ అనంతరం వేదికపైకి ఆహ్వానించకుండా అక్కడే నిలబెట్టి స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారని గ్రామస్తులు ఆరోపించారు.వేదిక ఎందుకు ఏర్పాటు చేయలేదని హెచ్ఎంను ప్రశ్నించగా,ఇన్‌చార్జి టీచర్‌కు చెప్పినప్పటికీ వేదిక ఏర్పాటు చేయలేకపోయారని, ఆటపాటల కార్యక్రమాలు నిర్వహించలేకపోయినందున వేదిక ఏర్పాటు చేయలేదని సమాధానం ఇచ్చినట్లు తెలిపారు.గత జనవరి 26న నిర్వహించిన గణతంత్ర దినోత్సవ వేడుకల్లోనూ వార్డు సభ్యులను పేరుపేరునా వేదికపైకి ఆహ్వానించకుండా అవమానించారని,ఆ సమయంలోనే హెచ్ఎం దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లినా



తాజాగా మరోసారి అదే విధంగా వ్యవహరించారని గ్రామస్తులు ఆరోపించారు.ఈ వ్యవహారం వెనుక రాజకీయ ఉద్దేశాలు ఉన్నాయనే అనుమానాలను కొందరు గ్రామస్తులు వ్యక్తం చేశారు.గ్రామ పాలకవర్గానికి, ప్రజాప్రతినిధులకు తగిన గౌరవం కల్పించాల్సిన బాధ్యత పాఠశాల యాజమాన్యంపై ఉందని అన్నారు.ఈ విషయంపై సోమవారం ఎంఈఓతో పాటు జిల్లా కలెక్టర్‌కు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసి,బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరనున్నట్లు గ్రామస్తులు తెలిపారు.ఈ ఘటనను గ్రామ ఉపసర్పంచ్ నల్ల హరి గౌడ్‌తో పాటు రవి గౌడ్, సురేందర్‌రెడ్డి,పాపిరెడ్డి, నరేందర్‌చారి, విష్ణువర్ధన్‌రెడ్డి, నర్సింగ్‌రావు, ముస్తఫా,అక్బర్‌బేగ్, సాయికుమార్,నరేందర్‌రెడ్డి, విష్ణుగౌడ్,భాస్కర్,యాదగిరి,బన్నీ తదితర గ్రామ యువకులు, ప్రజలు ఖండించారు.




# కొండాపూర్ మండలంలో ఘనంగా 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

**కొండాపూర్ ప్రజా జ్యోతి**

కొండాపూర్ మండల కేంద్రంలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. తహసీల్దార్ కార్యాలయం, పోలీస్ స్టేషన్, ఎంపీడీవో కార్యాలయాల్లో జాతీయ జెండాలను ఆవిష్కరించి స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు.తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ అశోక్ జాతీయ జెండాను ఆవిష్కరించి గౌరవ వందనం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకుంటూ దేశ అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.కొండాపూర్ పోలీస్ స్టేషన్‌లో సీఐ సుమన్ కుమార్, ఎస్సై సోమేశ్వరి ఆధ్వర్యంలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు నిర్వహించారు. సీఐ సుమంత్ కుమార్ జాతీయ జెండాను ఆవిష్కరించగా, పోలీస్ సిబ్బంది గౌరవ వందనం సమర్పించారు. దేశ రక్షణ, ప్రజల భద్రత కోసం సేవలందిస్తున్న సైనికులు, పోలీసుల త్యాగాలను ఈ సందర్భంగా స్మరించుకున్నారు.ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో సౌమ్యశ్రీ



జాతీయ జెండాను ఆవిష్కరించారు. అధికారులు, సిబ్బంది జాతీయ జెండాకు గౌరవ వందనం సమర్పించారు. గ్రామాల అభివృద్ధి, ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు అధికారులు, సిబ్బంది సమష్టిగా కృషి చేయాలని ఎంపీడీవో సౌమ్యశ్రీ సూచించారు.ఈ సందర్భంగా మూడు కార్యాలయాల్లోనూ స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకున్నారు. దేశ సమైక్యత, సమగ్రతను కాపాడుతూ బాధ్యతాయుత పౌరులుగా ముందుకు సాగాలని అధికారులు పిలుపునిచ్చారు. కార్యక్రమాల్లో ఆయా శాఖల అధికారులు, సిబ్బంది, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# యువత దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని

**నారాయణఖేడ్, ప్రజాజ్యోతి ఆగస్టు 15:**



దేశ స్వాతంత్ర్యం కోసం ఎందరో మహనీయులు చేసిన త్యాగాలను స్మరించుకుంటూ యువత దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ రీజన్-17 నేషనల్ కోఆర్డినేటర్ సర్వీస్ సంతోష్ పిలుపునిచ్చారు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ రీజన్17, నారాయణఖేడ్ ఆధ్వర్యంలో జాతీయ పతాక ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు.నేషనల్ కోఆర్డినేటర్సర్వీస్ సంతోష్ కుమార్, రీజినల్ ప్రెసిడెంట్ జ్యోతిర్లింగం, సెక్రటరీ శ్వేత ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జహీరాబాద్ పార్లమెంట్ సభ్యులు సురేష్ కుమార్ షెట్కార్, నారాయణఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి, మున్సిపల్ చైర్మన్ నగేష్ కుమార్ షెట్కార్ హాజరై జాతీయ పతాకానికి గౌరవ వందనం చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను నేటి తరం స్ఫూర్తిగా తీసుకోవాలని అన్నారు. యువత దేశ అభివృద్ధిలో చురుకైన పాత్ర పోషించాలని, సమాజ సేవ, విద్య, ఆరోగ్యం, యువత అభివృద్ధి, మహిళా సాధికారత వంటి రంగాల్లో సేవా కార్యక్రమాలను విస్తృతం చేయాలని సూచించారు. సమాజ అభివృద్ధికి కృషి చేయడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నారాయణఖేడ్ పట్టణ నాయకులు, కార్యకర్తలు, ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ సభ్యులు, రీజినల్ ఫాస్ట్ సెక్రటరీ భాస్కర్, లీడర్షిప్ డైరెక్టర్ సుశాంత్ తదితరులు పాల్గొన్నారు.

## రామచంద్రాపురంలో మిన్నంటిన స్వాతంత్ర్య సంబరాలు:

### రాజకీయాలకు అతీతంగా మువ్వెన్నెల జెండా నీడన ఏకమైన నాయకులు!

**రామచంద్రాపురం, ఆగస్టు15:**

భారత దేశ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు రామచంద్రాపురం అఖిల్ టెంట్ హౌస్ ఎక్స్ రోడ్డు కూడలి వద్ద అత్యంత వైభవంగా, దేశభక్తి ఉట్టిపడేలా నిర్వహించారు. పటాన్‌చెరు నియోజకవర్గ దీ=ూ పార్టీ సీనియర్ నాయకుడు, ౹్రఖూ మండల అధ్యక్షుడు మొహమ్మద్ అబ్బు అలీ ఖురేషి, మరియు 112 డివిజన్ మాజీ కార్పొరేటర్ శ్రీమతి తోంట అంజయ్య యాదవ్ (దీ్రూ పార్టీ) ముఖ్య అతిథులుగా హాజరై ఉమ్మడిగా జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు.రాజకీయాలకు అతీతంగా సామాజిక ఐక్యత:ఈ కార్యక్రమం రాజకీయ రంగులకు అతీతంగా స్థానిక నాయకులను, ప్రజలను ఒకే వేదికపైకి తీసుకువచ్చింది. జెండా ఆవిష్కరణ అనంతరం ముఖ్య అతిథులు మాట్లాడుతూ, దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలర్పించిన మహనీయుల త్యాగాలను స్మరించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పిలుపునిచ్చారు. కులమతాలకు, రాజకీయాలకు తావు లేకుండా అందరూ కలిసికట్టుగా దేశాభివృద్ధికి తోడ్పడాలని వారు ఆకాంక్షించారు.ఈ వేడుకల్లో వినయ్ కుమార్, షేక్ అఖిల్, షేక్ సిరాజ్, అబ్బాస్ అలీ వంటి యువ నాయకులు ప్రత్యేక ప్రసంగాలు చేస్తూ యువత దేశ



నిర్మాణంలో కీలక పాత్ర పోషించాలని కోరారు. స్థానిక రైతులు, వ్యాపారస్తులు, వివిధ పార్టీల కార్యకర్తలు మరియు అభిమానులు భారీ సంఖ్యలో తరలివచ్చి జైహింద్, వందేమాతరం నినాదాలతో ఆ ప్రాంతాన్ని మారుమోగించారు. కార్యక్రమం ముగింపులో వచ్చిన వారందరికీ మిఠాయిలు పంపిణీ చేసి స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

## మెదక్ జిల్లా కార్యాలయంలో కలెక్టర్ జండా ఆవిష్కరణ

**మెదక్ (ప్రజాజ్యోతి )**

స్వతంత్ర దినోత్సవం లో భాగంగా ఈరోజు మెదక్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ ఆఫీస్ లో మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమ సింగ్ గారు త్రివర్ణ పతాకార పతాకాన్ని ఆవిష్కరించారు. ఇట్టి కార్యక్రమంలో భాగంగా కలెక్టర్ ముఖ్యఅతిథిగా పాల్గొని జిల్లా కార్యాలయంలో పతాకావిష్కరణ గావించారు జిల్లా



అధికారులందరూ కూడా పాల్గొనడం జరిగింది. ఈ సందర్భంగా జనగణమన వందేమాతరం ఇతర దేశభక్తి గీతాలను ఆలపించడం జరిగింది.

## సబ్ కలెక్టర్ ఉమా హారతి చొరవతో విద్యార్థులకు ఉచిత కుల ధ్రువీకరణ పత్రాలు. బి. సురేష్ ఎం. ఈ. ఓ.

**కల్హేర్, ఆగస్టు 15: ప్రజా జ్యోతి:**

నారాయణాఖేడ్ సబ్ కలెక్టర్ ఉమా హారతి ప్రత్యేక చొరవతో కల్హేర్ మండలంలోని పదో తరగతి విద్యార్థులకు ఉచితంగా కుల ధ్రువీకరణ పత్రాలు జారీ చేశారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సంబంధిత అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని ఈ ప్రక్రియను పూర్తి చేశారు.

కల్హేర్ మండలంలో పదో తరగతి చదువుతున్న బాలబాలికలకు అవసరమైన కుల ధ్రువీకరణ పత్రాలను ఉచితంగా అందించేందుకు సబ్ కలెక్టర్ ఉమా హారతి, సబ్ డివిజనల్ అధికారి ప్రత్యేక దృష్టి సారించారు. ఈ క్రమంలో మొత్తం 138 మంది విద్యార్థులకు ఉచితంగా కుల ధ్రువీకరణ పత్రాలు పూర్తి స్థాయిలో జారీ చేసినట్లు కల్హేర్ తహసీల్దార్ శివ శ్రీనివాస్ ఆగస్టు 15న తెలిపారు.

విద్యార్థుల భవిష్యత్ విద్యాభ్యాసానికి, ఉన్నత విద్యలో ప్రవేశాలకు, ప్రభుత్వ పథకాలు మరియు ఇతర అవసరాలకు కుల ధ్రువీకరణ పత్రాలు ఎంతో కీలకమైనవని అధికారులు పేర్కొన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు కార్యాలయాల చుట్టూ తిరగకుండా, సమయాన్ని మరియు ఖర్చును ఆదా చేసే విధంగా ఉచితంగా ధ్రువీకరణ పత్రాలు అందించడం పట్ల విద్యార్థులు, తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు, వారి తల్లిదండ్రుల తరఫున ప్రత్యేక చొరవ తీసుకున్న సబ్ కలెక్టర్ ఉమా హారతికి కృతజ్ఞతలు తెలిపారు. అలాగే కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేసిన కల్హేర్



తహసీల్దార్ శివ శ్రీనివాస్‌తో పాటు తహసీల్దార్ కార్యాలయ సిబ్బందికి విద్యార్థులు, తల్లిదండ్రులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.విద్యార్థుల సంక్షేమం కోసం అధికారులు తీసుకున్న ఈ చర్యను స్థానికులు అభినందించారు.

ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
ఆదివారం 16 ఆగస్టు 2026

## చెర్ల గోపులారంలో ఘనంగా 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

**కొండాపూర్ ప్రజా జ్యోతి**

మండలంలోని చెర్ల గోపులారం గ్రామ ప్రభుత్వ పాఠశాలలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. గ్రామ సర్పంచ్ మహేశ్వరి, సతీష్‌లు,పాఠశాల ప్రధానోపాధ్యాయులు లక్ష్మణ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో జాతీయ జెండాను ఆవిష్కరించి స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ మహేశ్వరి, సతీష్‌లు ప్రాథమిక పాఠశాల విద్యార్థులు, అంగన్వాడీ చిన్నారులకు అల్పాహారం తినేందుకు ఉపయోగపడేలా 50కి పైగా ప్లేట్లు, గ్లాసులను అందజేశారు. చిన్నారుల సౌకర్యాన్ని దృష్టిలో పెట్టుకుని అవసరమైన సామగ్రిని అందించడం పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు లక్ష్మణ్, ఉపాధ్యాయురాలు పద్మ, అంగన్వాడీ టీచర్ అనసూజ, ఉపసర్పంచ్, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, యువకులు, విద్యార్థులు, అంగన్వాడీ చిన్నారులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు మాట్లాడుతూ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులు, చిన్నారుల కోసం సేవా కార్యక్రమం చేపట్టడం అభినందనీయమని అన్నారు. విద్యార్థుల్లో దేశభక్తి, సేవాభావం పెంపొందించేలా ఇలాంటి కార్యక్రమాలు మరిన్ని నిర్వహించాలని ఆకాంక్షించారు.



## సదాశివపేటలో ఉదారత పెళ్లికూతురికి మేనమామలా అండగా నిలిచిన మాజీ కౌన్సిలర్ ఛాయా శాంతి కుమార్

**సంగారెడ్డి ప్రజా జ్యోతి ప్రతినిధి :**

సదాశివపేటలో మాజీ కౌన్సిలర్ ఛాయా శాంతి కుమార్ 14వ వార్డుకు చెందిన ఒక వివాహ వేడుకకు హాజరైన ఆయన, మేనమామ స్థానంలో నిలిచి పెళ్లికూతురీ కి ఘనంగా కానుకలు అందజేశారు. సదాశివపేట పట్టణంలోని 14వ వార్డులో జరిగిన ఒక వివాహ వేడుక అందరి దృష్టినీ ఆకర్షించింది. వార్డుకు చెందిన పెళ్లి జరుగుతోందని తెలుసుకున్న మాజీ కౌన్సిలర్ ఛాయా శాంతి కుమార్, స్వయంగా కళ్యాణ వేదిక వద్దకు చేరుకున్నారు. పెళ్లికూతురికి రూ. 50,000 నగదుతో పాటు పట్టుచీరను కానుకగా అందించి తన ఉదార స్వభావాన్ని చాటుకున్నారు. సొంత మేనమామలా అండగా నిలిచి పెళ్లి కానుక అందించడమే కాకుండా, పెళ్లికూతురుని ఆశీర్వదించిన ఛాయా శాంతి కుమార్‌పై వార్డు ప్రజలతో పాటు స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి కార్యక్రమంలో ఆయన ఎప్పుడూ ముందుంటారని స్థానికులు కొనియాడారు.



# ఘనంగా 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

**రాయికోడ్ ఆగస్టు 15 (ప్రజా జ్యోతి):**

మండలంలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. మండలంలోని ప్రభుత్వ,ప్రైవేటు కార్యాలయాలు,విద్యాసంస్థలు,పోలీస్ స్టేషన్, తెలంగాణ తల్లి విగ్రహం తదితర ప్రాంతాల్లో జాతీయ జెండాలను ఎగురవేసి స్వాతంత్ర్య దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. మార్కెట్ కార్యాలయంతో పాటు వివిధ ప్రభుత్వ,ప్రైవేటు కార్యాలయాల్లోనూ అధికారులు జెండా ఎగురవేసి జాతీయ గీతాన్ని ఆలపించారు. ఈ సందర్భంగా స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకుంటూ దేశాభివృద్ధికి ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా కృషి చేయాలని వక్తలు పిలుపునిచ్చారు. ప్రజలకు స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమాల్లో ఎమ్మార్వో ఆశాజ్యోతి,ఎంపీడీవో ఎం. షరీఫ్,ఎంఈఓ నరసింహులు,ఏఎంసీ చైర్మన్ సుధాకర్ రెడ్డి,ప్రజా ప్రతినిధులు,వివిధ శాఖల అధికారులు, నాయకులు, ఉద్యోగులు, విద్యార్థులు,ప్రజలు తదితరులు పాల్గొన్నారు. మండలవ్యాప్తంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఉత్సాహభరిత వాతావరణంలో జరిగాయి.



## జాతీయ జెండా నీడలో బీజేపీ నేతల దేశభక్తి నినాదాలు

**ఆందోల్, ఆగస్టు 15 (ప్రజాజ్యోతి):**

ఆందోల్–జోగిపేట మున్సిపాలిటీలో బీజేపీ ఆధ్వర్యంలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు దేశభక్తి ఉట్టిపడేలా నిర్వహించారు. బీజేపీ ఆందోల్ మండల అధ్యక్షురాలు మహేష్కర్ పావని జాతీయ జెండాను ఆవిష్కరించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. స్వాతంత్ర్య పోరాట యోధుల త్యాగాల ఫలితంగా లభించిన స్వేచ్ఛను కాపాడుకుంటూ దేశాన్ని మరింత అభివృద్ధి పథంలో నడిపించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. గత 80 ఏళ్లలో భారత్ అనేక రంగాల్లో పురోగతి సాధించిందని, నేడు సాంకేతిక, శాస్త్ర, అంతరిక్ష రంగాల్లో ప్రపంచ దేశాలతో సమానంగా నిలుస్తోందన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో భారత్‌ను విశ్వగురువుగా తీర్చిదిద్దే దిశగా కేంద్ర ప్రభుత్వం ముందుకు సాగుతోందని పావని పేర్కొన్నారు. రైతులు, మహిళలు, విద్యార్థులు, పేదలు, బడుగు బలహీన వర్గాల సంక్షేమానికి అనేక కార్యక్రమాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆధ్యాత్మికవేత్త కుంట్ల లింగమయ్య, నాయకులు పద్మ జోగినాథ్, రత్నపూర్ జగన్నాథ్, ప్రభాత్, ఆర్. ప్రభాకర్, మహేష్కర్ సుమన్, మేదరి పాపయ్య, బండల అర్జున్, బండల మీనా, కుక్కుట్ల రమేష్, దామోదర్ రెడ్డి, నర్సింలు తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## ఎల్లమ్మ గుడలో 80వ స్వాతంత్ర వేడుకల్లో నూతన గ్రామపంచాయతీ ప్రారంభోత్సవం

### - మైలసమైక్య భవనం ప్రారంభోత్సవం
### - జెండా ఆవిష్కరించిన గ్రామ సర్పంచ్ పద్మ ప్రవీణ్

**హత్నూర 15ఆగస్టు (ప్రజా జ్యోతి)**

మండల పరిధిలోని ఎల్లమ్మ గూడ గ్రామంలో నూతనంగా నిర్మించిన గ్రామపంచాయతీ భవనాన్ని పంద్రాగస్టు రోజునా ఉదయం 9 గంటలకు ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ పద్మ ప్రవీణ్ మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాల నుండి నూతన గ్రామపంచాయతీ లేక మనకు ఎంతో తీవ్ర ఇబ్బందులు నెలకొన్నాయి అంతేకాకుండా గత కొన్ని సంవత్సరాల నుండి మా గ్రామానికి గ్రామపంచాయతీ భవనం లేకుండే కానీ ఇప్పుడు గ్రామపంచాయతీ భవనం శాంక్షన్ కావడం మానా అదృష్టమని భావించారు. ఈరోజు గ్రామంలోని ప్రాథమిక పాఠశాల అంగన్వాడి కేంద్రంలో ఎస్సీ కమ్యూనిటీ హాల్ దగ్గర జెండా ఆవిష్కరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి మధ్యల మంగమ్మ కుమార్ ఉప సర్పంచి ఎర్ర కర్ణాకర్ పంచాయతీ పాలకవర్గ సభ్యులు పారిశుద్ధ్య కార్మికులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



## సీఎం పర్యటనలో బీఆర్ఎస్ యువ నాయకుల అరెస్ట్.. పోలీస్ స్టేషన్‌కు వెళ్లి విడిపించిన చింత సాయినాథ్

**సంగారెడ్డి ప్రజా జ్యోతి ప్రతినిధి :**

సీఎం రేవంత్‌రెడ్డి సంగారెడ్డి పర్యటన సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ యువ నాయకులను పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేసి ఇంద్రకరణ్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ విషయం తెలుసుకున్న సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ గారి తనయుడు చింత సాయినాథ్ వెంటనే ఇంద్రకరణ్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లారు. పోలీసులతో మాట్లాడి, అరెస్ట్ చేసిన బీఆర్ఎస్ యువ నాయకులను విడుదల చేయించి తన వెంట తీసుకువచ్చారు. ఈ సందర్భంగా చింత సాయినాథ్ మాట్లాడుతూ.. ప్రజాస్వామ్య పద్ధతిలో నిరసన తెలిపే హక్కు ప్రతి ఒక్కరికీ ఉందని, యువ నాయకులను ముందస్తుగా అరెస్ట్ చేయడం సరికాదని అన్నారు. బీఆర్ఎస్ యువతకు అండగా ఉంటామని తెలిపారు.



# కల్హేర్ మండలంలో ఘనంగా 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

**కల్హేర్, ఆగస్టు 15 ( ప్రజాజ్యోతి):**

సంగారెడ్డి జిల్లాలోని కల్హేర్ మండల కేంద్రంలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. మండలంలోని వివిధ ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలు, సంఘాల ఆధ్వర్యంలో జాతీయ జెండాను ఆవిష్కరించి స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకున్నారు.మండల కల్హే ర్ తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ కే. శివ శ్రీనివాస్ జాతీయ జెండాను ఆవిష్కరించి స్వాతంత్ర్య దినోత్సవ ప్రాధాన్యతను వివరించారు. ఎంపీడీవో కార్యాలయంలో హరి నందన్ రావు జెండా ఆవిష్కరించి , దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడిన మహనీయుల త్యాగాల ఫలితంగానే నేడు మనం స్వేచ్ఛా వాతావరణంలో జీవిస్తున్నామని తెలిపారు.

### పోలీసుల ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాలు

కల్హేర్ పోలీస్ స్టేషన్‌లో ఎస్సై రవి గౌడ్ ఆధ్వర్యంలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ప్రత్యేకంగా నిర్వహించారు. పోలీసుల కవాతు కార్యక్రమానికి హాజరైన ప్రజలను ఆకట్టుకుంది. “మన దేశంమన విధి” అనే కర్తవ్య భావనతో పనిచేయడం పోలీసుల ప్రధాన లక్ష్యమని ఎస్సై రవి గౌడ్ తెలిపారు.

### వైద్య సిబ్బంది సేవలు అభినందనీయం

కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో డాక్టర్ జెబా ఆధ్వర్యంలో సిబ్బంది స్వాతంత్ర్య వేడుకలు నిర్వహించారు. జాతీయ జెండాను ఆవిష్కరించిన అనంతరం ఆసుపత్రిలో రోగులకు అందిస్తున్న నాణ్యమైన వైద్య సేవలను వివరించారు. రోగుల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుని, వాటికి వెంటనే పరిష్కారం చూపేందుకు కృషి చేస్తామని డాక్టర్ జెబా తెలిపారు.

### వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో వేడుకలు

వ్యవసాయ శాఖ కార్యాలయంలో వ్యవసాయ అధికారి వెంకటేశం ఆధ్వర్యంలో జాతీయ జెండాను ఆవిష్కరించి స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కృష్ణవేణితో పాటు వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

### విద్యార్థులకు బహుమతుల ప్రదానం

స్థానిక శ్రీ సాయి విద్యాలయంలో ప్రిన్సిపాల్ పండరి గౌడ్ ఆధ్వర్యంలో విద్యార్థులతో వందేమాతరం, జాతీయ గీతాలాపన నిర్వహించారు. అనంతరం పాటల పోటీలు, ఉపన్యాస పోటీల్లో



ప్రతిభ కనబరిచి ప్రథమ స్థానాలు సాధించిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

### గ్రామపంచాయతీ, ఇతర సంస్థల్లోనూ ఘనంగా

వెటర్నరీ కార్యాలయం, గ్రామపంచాయతీ కార్యాలయాల్లోనూ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కల్హే ర్ సర్పంచ్ కోడి గంగారాం, ఉపసర్పంచ్ మహేష్, గ్రామపంచాయతీలి సిబ్బంది, వార్డు సభ్యులు తదితరుల ఆధ్వర్యంలో జాతీయ జెండాను ఆవిష్కరించారు.జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కళాశాల, ప్రాథమిక పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ముదిరాజ్ సంఘం తదితర సంస్థలు, సంఘాల అధ్యక్షుల ఆధ్వర్యంలోనూ జాతీయ జెండాను ఆవిష్కరించి స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను నిర్వహించారు.

### సమన్వయంతో విజయవంతం

మండల వ్యాప్తంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీస్ శాఖ, పారిశుద్ధ్య శాఖతో పాటు ఇతర ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పనిచేసి స్వాతంత్ర్య దినోత్సవ కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించాయి. వివిధ ప్రాంతాల్లో జరిగిన వేడుకల్లో అధికారులు, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు, ఉద్యోగులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## స్వతంత్ర దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న మెదక్ జిల్లా ఇన్చార్జి మంత్రి

**మెదక్ (ప్రజాజ్యోతి )**

స్వతంత్ర దినోత్సవ వేడుకల్లో పాల్గొన్నటువంటి మంత్రి వివేక్ వెంకటస్వామి ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు కలెక్టర్ ఎస్పీ మరియు ఇతర ప్రభుత్వ అధికారులు. స్వతంత్ర దినోత్సవం పురస్కరించుకొని మెదక్ పట్టణంలో ఎస్పీ ఆఫీస్ నందు గల పోలీస్ పెరేడ్ గ్రౌండ్లో ఏర్పాటు చేసినటువంటి స్వతంత్ర దినోత్సవ వేడుకలలో మంత్రులు ఎమ్మెల్యే మరియు ఇతర ప్రభుత్వ అధికారులు పాల్గొని అంగరంగ వైభవంగా స్వతంత్ర దినోత్సవ వేడుకలను నిర్వహించడం జరిగింది. ఉత్తమ ప్రతిభ కనిపించిన టువంటి ప్రభుత్వ అధికారులకు స్వతంత్ర దినోత్సవ పురస్కారాలు కూడా అందించడం జరిగింది. ఇట్టి కార్యక్రమంలో చిన్న పిల్లలు భరతమాత మరియు ఇతర వేషధారణలో పండగ వాతావరణాన్ని సృష్టించారు చిన్నపిల్లలు విద్యార్థులు దేశభక్తి నెలకొని వారు సంతోషాన్ని వ్యక్తపరిచారు.







# మువ్వన్నెల జెండాకు ఘన వందనం

## - త్యాగధనుల స్ఫూర్తితో వెల్దుర్తి జెడ్పీహెచ్ఎస్‌లో ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు- ప్రధానోపాధ్యాయులు బి సాంబయ్య

**వెల్దుర్తి (ప్రజాజ్యోతి) ఆగస్టు 15:**




వెల్దుర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు శనివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. జాతీయ జెండాను ఆవిష్కరించి దేశభక్తి నినాదాలతో పాఠశాల ప్రాంగణాన్ని మార్మోగించారు. ఈ సందర్భంగా విద్యార్థులు స్వాతంత్ర్య సమరయోధులు, జాతీయ నాయకుల వేషధారణలో పాల్గొని ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.గత విద్యా సంవత్సరంలో పదో తరగతిలో ఉత్తమ ప్రతిభ కనబరిచి ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థులను ఘనంగా సత్కరించారు. విద్యార్థుల్లో పోటీతత్వాన్ని పెంపొందించి, విద్యలో మరింత రాణించేలా ప్రోత్సహించేందుకు వెల్దుర్తి గ్రామానికి చెందిన పారిశ్రామికవేత్త నాలచెరువు రమేశ్ గౌడ్ తన వంతు సహకారం అందించారు.పదో తరగతిలో ప్రథమ స్థానంలో నిలిచిన జి. అక్షయకు రూ.20,000, ద్వితీయ స్థానంలో నిలిచిన ఎస్. మేఘనకు రూ.15,000, తృతీయ స్థానంలో నిలిచిన ఆర్. లిప్సికకు రూ.10,000 చొప్పున నగదు బహుమతులను అందజేశారు. అదేవిధంగా ఇంటర్ మొదటి సంవత్సరంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన శ్రీచరణ్‌కు రూ.5,000 నగదు ప్రోత్సాహకాన్ని అందించారు.ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి. సాంబయ్య మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. విద్యార్థుల ప్రతిభను గుర్తించి ప్రోత్సహిస్తున్న దాతలు, పారిశ్రామికవేత్తల సహకారం అభినందనీయమని పేర్కొన్నారు. ఇలాంటి ప్రోత్సాహకాలు విద్యార్థుల్లో మరింత పట్టుదల, ఆత్మవిశ్వాసాన్ని పెంచుతాయని తెలిపారు.ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను సర్పంచ్ దండెం ఆదర్శ్, ఉపాధ్యాయులు వెంకటస్వామి, శ్రీనివాసరావు, నరసింహారెడ్డి, చార్లెస్, విజయ్ కుమార్, ఖదీర్ పాషా, అర్చన, అమూల్య, జయసుధ, నవనీత, శైలజ, ఆకాంక్ష అభినందించారు. భవిష్యత్తులో మరింత ఉన్నత ఫలితాలు సాధించి పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

# కాంగ్రెస్ పార్టీ, మార్కెట్ కమిటీ, మున్సిపల్ కార్యాలయంలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో పాల్గొన్నా

## - మాజీ మంత్రివర్యులు జహీరాబాద్ ఇంచార్జ్ డా॥ఏ.చంద్రశేఖర్

**జహీరాబాద్, ఆగస్టు 15 (ప్రజా జ్యోతి న్యూస్)**

జహీరాబాద్‌లో కాంగ్రెస్ పార్టీ కార్యాలయం, మార్కెట్ కమిటీ మరియు మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో మాజీ మంత్రివర్యులు,జహీరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డా॥ఏ.చంద్రశేఖర్ పాల్గొని జాతీయ జెండాను ఆవిష్కకరణలో పాల్గొని, దేశ ప్రజలకు మరియు నియోజకవర్గ ప్రజలకు స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడిన మహనీయుల త్యాగాలను స్మరించు కుంటూ, దేశాభి వృద్ధి కోసం ప్రతి ఒక్కరూ ఐక్యంగా కృషి చేయాలని ఆయన పిలుపు నిచ్చారు. దేశ స్వాతంత్ర్యం కోసం ఎందరో మహాను భావులు తమప్రాణాలను అర్పించారని, వారిత్యాగాలు దేశ ప్రజల సంఘటిత పోరాట ఫలితాం గానే స్వాతంత్రం సిద్ధించందని తెలిపారు. ఆ మహాను బావుల త్యాగాలను మననం చేసుకొని వారి ఆశలు, ఆశయాలకు అనుగుణంగా భారత దేశ అభివృది పదంలో భాగ స్వాములు కావాలని పిలుపునిచ్చారు. దేశంలో కుల, మత, ప్రాంత బేధాలు ఉండ వద్దని, దేశ ప్రజలందరికీ సమాన హక్కులు, అవకాశాలు ఉండాలని అసమానతలు లేని సమాజం నిర్మాణం కావాలని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గారు ప్రపంచం లోనే అతి పెద్ద లిఖిత పూర్వక రాజ్యాంగాన్ని మనకు అందించారాని పేర్కొన్నారు. దాని ఫలితాం గానే నేడు మన మందరం కూడా గౌరవంగా తల ఎత్తుకొని జీవించగలుగు తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతి నిధులు, కౌన్సిలర్లు, కాంగ్రెస్ ముఖ్య నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.




# కార్యదర్శిగా కర్ర కిషన్నే కొనసాగించాలి

## - జేమ్లా తండా వాసులు ఎంపీడీవో కు లేఖ.

**కల్వ్హర్.ఆగస్టు 15 (ప్రజాజ్యోతి):**

జేమ్లా తండా గ్రామ పంచాయతీ కార్యదర్శిగా కర్ర కిషన్నే కొనసాగించాలని కోరుతూ తండావాసులు శనివారం ఎంపీడీవోకు బహిరంగ లేఖ అందజేశారు.గత రెండేళ్లుగా కర్ర కిషన్ గ్రామ పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తూ గ్రామాభివృద్ధికి ఎంతో కృషి చేశారని గ్రామస్తులు పేర్కొన్నారు. ప్రతి పౌరుడికి అందుబాటులో ఉంటూ ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు చొరవ చూపుతున్నారని తెలిపారు.సర్పంచ్ గోవింద్ నాయక్ డీపీఓకు ఇచ్చిన ఫిర్యాదు నేపథ్యంలో కర్ర కిషన్‌ను బదిలీ చేయవద్దని, జేమ్లా తండాలోనే కార్యదర్శిగా కొనసాగించాలని తండావాసులు ఎంపీడీవోను కోరారు. ప్రజల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని ఆయనను ఇక్కడే కొనసాగించాలని విజ్ఞప్తి చేశారు.



# జాతీయ పతాకానికి వందనం.. అంబేద్కర్‌కు నివాళి

**అందోల్, ఆగస్టు 15 (ప్రజాజ్యోతి):**

స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని జోగిపేటలో మాజీ ఎమ్మెల్యే క్రాంతి కిరణ్ దేశభక్తి, సామాజిక సమానత్వ సందేశాన్ని చాటారు. బీఆర్ఎస్ పార్టీ కార్యాలయ ఆవరణతో పాటు కేసీఆర్ డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల ప్రాంగణంలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు.అనంతరం రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. స్వాతంత్ర్యం అంటే కేవలం బ్రిటిష్ పాలన నుంచి విముక్తి మాత్రమే కాదని, సమాజంలోని ప్రతి వర్గానికి సమాన హక్కులు, గౌరవం, అవకాశాలు కల్పించడమే నిజమైన స్వాతంత్ర్య స్ఫూర్తి అని కార్యక్రమం ద్వారా సందేశమిచ్చారు.ఈ వేడుకల్లో మాజీ డీసీసీబీ వైస్ చైర్మన్ పి.జైపాల్ రెడ్డి, మాజీ ఏఎంసీ చైర్మన్లు పి.నారాయణ ముదిరాజ్, డి.బి.నాగభూషణం, మాజీ ఎంపీపీలు అర్జునయ్య, రామగౌడ్, బాలయ్య, కౌన్సిలర్లు పట్లూరి శివశేఖర్, నాగరత్నం గౌడ్‌తో పాటు బీఆర్ఎస్ నాయకులు చాపల వెంకటేశం, మాచర్ల విజయ్ కుమార్, ఎ. శంకరయ్య, పత్తి విరేశం, మాణిక్ రెడ్డి, బిర్ల శంకర్, ఊస నాగరాజు, ఆకుల శంకర్, యెర్ర సాయిలు, ఖాజ పాష, రఫిక్, మహేష్ యాదవ్, నాయికోటి అశోక్, కరుణాకర్, పరిపూర్ణం కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.





**స్వతంత్ర దినోత్సవం పురస్కరించుకొని ఏడుపాయల వనదుర్గ అమ్మవారిని మూడు రంగులలో అలంకరించి భక్తులకు దర్శనాన్ని కల్పించడం జరిగింది.**



# ఉత్తమ అవార్డు గా ఆర్ అండ్. బి కి అరుదైన గౌరవం

మెదక్ (ప్రజా జ్యోతి)

మెదక్ జిల్లా :80వ స్వాతంత్ర్య దినోత్సవాన్నిపురస్కరించుకుని శనివారం మెదక్ జిల్లా కేంద్రంలోని పోలీస్ పెరేడ్ గ్రౌండ్ ప్రాంగణంలో నిర్వహించిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో జిల్లా ఇన్చార్జి మంత్రివర్యులు శ్రీ గడ్డం వివేక్ వెంకటస్వామి ముఖ్య అతిథిగా విచ్చేసి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి జిల్లా ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ జిల్లా ప్రజలకు స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేస్తూ, దేశానికి స్వాతంత్ర్యం సాధించేందుకు ఎందరో మహనీయులు చేసిన త్యాగాలను స్మరించుకున్నారు. వారి పోరాటాలు, త్యాగాల ఫలితంగానే నేడు మనం స్వేచ్ఛా వాయువులు పీలుస్తున్నామని పేర్కొన్నారు. అనంతరం పోలీస్ గ్రౌండ్లో జిల్లా ముఖ్య అతిథులు ప్రేక్షకులు సాంస్కృతిక కార్యక్రమాలను తిలకించారు అనంతరం. జిల్లాలో ఉత్తమప్రతిభ కనబరిచిన జిల్లా అధికారులకు, సహ ఉద్యోగులకు మంత్రి వేక్ వెంకటస్వామి, మరియు జిల్లా కలెక్టర్ ప్రతిమ సింగ్, శాసనసభ్యులు మైనంపల్లి రోహిత్ చేతుల మీదుగా ఉత్తమ ప్రశంసా పత్రాల అందించారు. ఈ సందర్భంగా మెదక్ జిల్లా రోడ్డు భవనంల శాఖ లో గ్యాంగ్ మాన్ గా గత 45 సంవత్సరాల నుండి విధి నిర్వహణ నిర్వహిస్తున్న సంగెపు నర్సింలు కు ఉత్తమ ప్రతిభ కనబరిచినందుకు మెదక్ జిల్లా ఇన్చార్జి మంత్రి వివేక్ వెంకటస్వామి చేతుల మీదుగా ఉత్తమ అవార్డు ను ఈరోజు అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేను గత 42 సంవత్సరాల నుండి ఎన్నో సేవా




కార్యక్రమాలు మా ఉన్నత ఉద్యోగుల సహకారంతో నా తోటి ఉద్యోగుల సహకారంతో నాకు ఈ ఉత్తమ అవార్డు లభించింది అని ఆయన తెలిపారు. ఈ అవార్డు గెలుపొందినందుకు నా తోటి ఉన్నత ఉద్యోగులకు నాతో పని చేసిన సహకార ఉద్యోగులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్న అని ఆయన కోరారు. ఇలాంటి సహకారం మా శాఖ నుండి ఎల్లప్పుడూ నాకు మరియు అతని ఉద్యోగులకు సహకారం ఉండాలని ఆయన కోరారు. ఈ అవార్డు రావడంతో ఎంతో సంతోషంగా ఉందని నాకు ఈ అవార్డు రావడానికి సహకరించిన నాతోటి మిత్రులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుకుంటున్నాను అని ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పి శంకర్, డిప్యూటీ ఇంజనీర్ కె వెంకటేశం,పి ఏ ఈ ఈ ఇ. కరుణ, ఏ ఈ ఈ ఏచ్ అరుణ్ రెడ్డి,ఏ ఈ ఈ విజయ సారధి,ఏ ఈ ఈ రవికుమార్,ఏ ఈ ఈ అవినాష్,డి ఏ ఓ శ్రవణ్ కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# త్యాగాల చరిత్రను చాటి చెప్పిన స్వాతంత్ర్య వేడుకలు..

## - స్వాతంత్ర్య సమరయోధుల ఆశయాలే మనకు మార్గదర్శకం
## - ప్రధానోపాధ్యాయులు పట్లూరి లక్ష్మణ్

తూప్రాన్ (ప్రజాజ్యోతి) ఆగస్టు 15:

తూప్రాన్ మున్సిపాలిటీ పరిధిలోని ఎంపీపీ ఎస్ తూప్రాన్ పాఠశాలలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు పట్లూరి లక్ష్మణ్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, విద్యార్థులతో కలిసి జాతీయ గీతాన్ని ఆలపించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ, ఎందరో మహనీయుల త్యాగాలు, పోరాటాలు, రక్తతర్పణల ఫలితంగానే మనకు స్వాతంత్ర్యం లభించిందని గుర్తు చేశారు. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకుంటూ ప్రతి ఒక్కరిలో దేశభక్తి, క్రమశిక్షణ, ఐక్యత, బాధ్యతాయుత పౌరసత్వం పెంపొందించుకోవాలని విద్యార్థులకు సూచించారు. దేశం మనకు ఏమిచ్చిందని ఆలోచించకుండా, మనం దేశానికి ఏమి ఇవ్వగలమో ఆలోచించాలని పిలుపునిచ్చారు. విద్యార్థులు కష్టపడి చదువుకుని ఉన్నత లక్ష్యాలను సాధించడంతో పాటు, మంచి పౌరులుగా ఎదిగి దేశ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు. పరిశుభ్రతను పాటించడం, పర్యావరణాన్ని పరిరక్షించడం, సోదరభావాన్ని పెంపొందించడం, జాతీయ సమైక్యతను కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. ఈ సందర్భంగా తూప్రాన్ మున్సిపల్ 4వ వార్డు కౌన్సిలర్ రాథోడ్ నాయక్ మాట్లాడుతూ, సుమారు 200 సంవత్సరాల పాటు బ్రిటిష్ పాలనలో ఉన్న భారతదేశానికి స్వాతంత్ర్యం సాధించేందుకు ఎందరో మహనీయులు తమ జీవితాలను, రక్తాన్ని త్యాగం చేశారని గుర్తు చేశారు. వారి పోరాటాల ఫలితంగానే నేడు మనం




స్వేచ్ఛా వాయువులు పీలుస్తూ స్వాతంత్ర్య వేడుకలను ఘనంగా జరుపు కుంటున్నా మని అన్నారు. విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత స్థాయికి ఎదగడంతో పాటు దేశం కోసం పాటుపడాలని, ఐక్యతా భావంతో మెలగాలని సూచించారు. దేశ భవిష్యత్తు యువత చేతుల్లోనే ఉందని, విద్యార్థులు బాధ్యతాయుత పౌరులుగా ఎదిగితేనే దేశం




మరింత అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, గ్రామస్తులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## తూప్రాన్ మున్సిపల్ కార్యాలయంలో ఘనంగా 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

### మున్సిపల్ చైర్మన్ బొంది రజిని రవీందర్ గౌడ్

తూప్రాన్ (ప్రజాజ్యోతి) ఆగస్టు 15 :

తూప్రాన్ మున్సిపల్ కార్యాలయంలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ బొంది రజిని రవీందర్ గౌడ్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, జాతీయ గీతాలాపనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పోరాడిన స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకుంటూ, వారి సేవలు, త్యాగాలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. దేశ ఐక్యత, సమగ్రత, అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. మువ్వన్నెల జెండా రెపరెపలతో, దేశభక్తి నినాదాలతో తూప్రాన్ మున్సిపల్ కార్యాలయ ప్రాంగణం దేశభక్తి భావంతో మార్మోగింది. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ సమతా కాశి రెడ్డి, మున్సిపల్ కమిషనర్ రమేష్ కుమార్, మున్సిపల్ కౌన్సిలర్లు, పట్టణ పుర ప్రముఖులు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## నారాయణఖేడ్‌లో ఘనంగా 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

నారాయణఖేడ్, ప్రజాజ్యోతి ఆగస్టు 15:

దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించి 80 వసంతాలు పూర్తయిన సందర్భంగా నారాయణఖేడ్ మున్సిపల్ పట్టణంలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో నారాయణఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి, జహీరాబాద్ ఎంపీ సురేష్ కుమార్ షెట్కార్, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు పట్లోళ్ల చంద్రశేఖర్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ నగేష్ కుమార్ షెట్కార్ తదితరులు పాల్గొని పలు ప్రాంతాల్లో జాతీయ జెండాను ఆవిష్కరించారు. నారాయణఖేడ్ సబ్ కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన అధికారిక కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం పంచాయతీరాజ్ శాఖ కార్యాలయం, మున్సిపల్ కార్యాలయ ప్రాంగణంలో జాతీయ జెండాలను ఆవిష్కరించారు. అగ్నిమాపక కేంద్రం ఎదురుగా ఉన్న తెలంగాణ అమరవీరుడు శ్రీకాంతాచారి విగ్రహం వద్ద జాతీయ జెండాను ఆవిష్కరించి, శ్రీకాంతాచారి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి మాట్లాడుతూ.. మహనీయుల త్యాగాల ఫలితంగానే నేడు దేశ ప్రజలు స్వేచ్ఛా వాయువులు పీలుస్తున్నారని అన్నారు. వారి ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే వారికి అందించే నిజమైన నివాళి అని పేర్కొన్నారు. నారాయణఖేడ్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో సమగ్రంగా అభివృద్ధి చేయడమే తమ లక్ష్యమని, ప్రజల సంక్షేమం, ప్రాంత ప్రగతి కోసం ప్రతి ఒక్కరూ పునరంకితం కావాలని పిలుపునిచ్చారు ఈ కార్యక్రమాల్లో స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, మున్సిపల్ కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు, ప్రభుత్వ సిబ్బంది, పట్టణ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# మూడేండ్ల కాంగ్రెస్ ప్రభుత్వంలో...



## - బ్రిడ్జి రోడ్డు నిర్మాణ పనులకు టెండర్ లు పిలవకపోవడం విడ్డూరం

మెదక్ (ప్రజాజ్యోతి )



– గత సంవత్సరం కురిసిన వర్షాలతో కొట్టుకుపోయిన రాజ్ పేట బ్రిడ్జి రోడ్డు – నీళ్ళలో ఆటో కొట్టుకుపోవడంతో ఇద్దరు రైతులు చనిపోయినా నిమ్మకునీరెత్తనట్టు వ్యవహరిస్తున్న అధికారులు – మూడు గ్రామాలు, రెండు మండలాల రైతులు, ప్రజల ఇబ్బందులు వర్ణణాతీతం – 2023 లోనే బ్రిడ్జి పనులకు రెన్యువల్ వచ్చినప్పటికి ప్రారంభం కాని పనులు – మూడు రోజుల్లో నిర్మాణ పనులు చేపట్టకపోతే గ్రామస్థుల సహకారంతో శ్రమధానం నిర్వహించి రోడ్డు ను ఏర్పాటు చేస్తా – మాజీ డిప్యూటీ స్పీకర్ యం. పద్మాదేవేందర్ రెడ్డి. గత ఏడాది కురిసిన భారీ వర్షాలకు కొట్టుకుపోయిన రాజ్‌పేట బ్రిడ్జి రోడ్డు నిర్మాణ పనులకు ఇప్పటికీ టెండర్లు పిలవకపోవడం విడ్డూరంగా ఉందని మాజీ డిప్యూటీ స్పీకర్, బీఆర్ఎస్ నాయకురాలు యం. పద్మాదేవేందర్ రెడ్డి విమర్శించారు. బ్రిడ్జి రోడ్డు లేక మూడు గ్రామాలు, రెండు మండలాలకు చెందిన రైతులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం హావేళిఘణాపురం మండలం రాజిపేట బ్రిడ్జి రోడ్డు నిర్మాణ పనులను ఆమె స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత ఏడాది వర్షాల సమయంలో రాజ్‌పేట బ్రిడ్జి వద్ద నీటి ప్రవాహానికి ఆటో కొట్టుకుపోయి ఇద్దరు రైతులు మృతి చెందిన ఘటన జరిగినప్పటికీ అధికారులు స్పందించకపోవడం దారుణమన్నారు. ప్రజల ప్రాణాలకు ముప్పు ఉన్నా అధికారులు నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. 2023లోనే బ్రిడ్జి నిర్మాణ పనులకు రెన్యువల్ వచ్చినప్పటికీ ఇప్పటివరకు పనులు ప్రారంభం కాకపోవడంపై ఆమె ప్రశ్నించారు. మూడేండ్ల కాంగ్రెస్ ప్రభుత్వంలో కనీసం బ్రిడ్జి రోడ్డు నిర్మాణ పనులకు టెండర్లు పిలవకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. రోడ్డు సౌకర్యం లేక రైతులు తమ వ్యవసాయ పనులకు వెళ్లేందుకు, పంటలను తరలించేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. విద్యార్థులు, వృద్ధులు, అత్యవసర సేవలకు వెళ్లే ప్రజల పరిస్థితి మరింత దయనీయంగా మారిందన్నారు. మూడు రోజుల్లోగా రాజ్‌పేట బ్రిడ్జి రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించకపోతే గ్రామస్థుల సహకారంతో శ్రమదానం నిర్వహించి రోడ్డు ఏర్పాటు చేస్తామని పద్మాదేవేందర్ రెడ్డి హెచ్చరించారు. ప్రజల సమస్యను ప్రభుత్వం, అధికారులు ఇకనైనా తీవ్రంగా పరిగణించి వెంటనే టెండర్లు పిలిచి నిర్మాణ పనులు ప్రారంభించాలని ఆమె డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పట్లోళ్ళ శశిధర్ రెడ్డి, మాజీ జడ్పీ వైస్ చైర్మెన్ లావణ్య రెడ్డి హావేలిఘణపురం మండల నాయకులు తదితరులు పాల్గోన్నారు.

---

# జెండా పండుగకు జనం జేజేలు..

## ఘనంగా 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

## మువ్వన్నెల జెండాలతో మార్మోగిన మండల కేంద్రం

వెల్దుర్తి (ప్రజాజ్యోతి) ఆగస్టు 15:




ఆగస్టు 15వ తేదీ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని వెల్దుర్తి మండల కేంద్రంలో స్వాతంత్ర్య వేడుకలు ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని తహసిల్దార్ కార్యాలయంలో తహసిల్దార్ జయలక్ష్మి, ఎంపీడీవో కార్యాలయంలో మండల ప్రతేక అధికారి రాకేష్, స్థానిక పోలీస్ స్టేషన్లో ఎస్సై కరుణాకర్ రెడ్డి అధికారులు, సిబ్బంది ఆధ్వర్యంలో జాతీయ జెండాలను ఆవిష్కరించి ఘనంగా వేడుకలు





జరిపారు. ఈ సందర్భంగా ప్రభుత్వ కార్యాలయాల వద్ద మువ్వన్నెల జెండాలు రెపరెపలాడగా.. పరిసర ప్రాంతాలు దేశభక్తి వాతావరణాన్ని సంతరించుకున్నాయి. అధికారులు, ఉద్యోగులు జాతీయ జెండాకు గౌరవ వందనం సమర్పించి అనంతరం జాతీయ గీతాన్ని ఆలపించారు. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకుంటూ వారికి ఘన నివాళులు అర్పించారు. దేశానికి స్వాతంత్ర్యం సాధించేందుకు ఎంతోమంది మహనీయులు తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పోరాటం చేశారని అధికారులు ఈ సందర్భంగా గుర్తు చేశారు. వారి త్యాగాల ఫలితంగానే నేడు మనం స్వేచ్ఛా వాతావరణంలో జీవిస్తున్నామని పేర్కొన్నారు. స్వాతంత్ర్య సమరయోధుల ఆశయాలను ముందుకు తీసుకెళ్లడంతో పాటు దేశ అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ ఉద్యోగులు ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందిస్తూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా కృషి చేయాలని ప్రతిజ్ఞ చేశారు. యువత దేశ భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని విద్య, క్రమశిక్షణ, సేవా భావంతో ముందుకు సాగాలని సూచించారు

# బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో...
# ఘనంగా 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు





మెదక్ (ప్రజా జ్యోతి )

- త్రివర్ణ పథాకాన్ని ఆవిష్కరించిన మాజీ డిప్యూటీ స్పీకర్ యం. పద్మాదేవేందర్ రెడ్డి
- అమరవీరుల త్యాగఫలితమే ఈనాటి స్వాతంత్ర్య దినోత్సవం
- స్వాతంత్ర్య సమరయోధుల పోరాటం చిరస్మరణీయం
- మాజీ డిప్యూటీ స్పీకర్, మెదక్ జిల్లా బిఆర్ఎస్ నాయకురాలు యం. పద్మాదేవేందర్ రెడ్డి

బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ డిప్యూటీ స్పీకర్, బీఆర్ఎస్ పార్టీ నాయకురాలు పద్మా దేవేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం జాతీయ గీతాన్ని ఆలపించారు. ఈ సందర్భంగా పద్మా దేవేందర్ రెడ్డి మాట్లాడుతూ.. భారతదేశానికి స్వాతంత్ర్యం రావడం వెనుక ఎందరో అమరవీరుల త్యాగాలు, స్వాతంత్ర్య సమరయోధుల పోరాటం ఉన్నాయని అన్నారు. వారి త్యాగాల ఫలితంగానే నేడు స్వాతంత్ర్య దినోత్సవాన్ని ఘనంగా జరుపుకుంటున్నామని పేర్కొన్నారు. దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పోరాడిన స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలు చిరస్మరణీయమని అన్నారు. వారి స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ దేశ అభివృద్ధికి తమ వంతు బాధ్యతగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పట్లోళ్ళ శశిధర్ రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మెన్ లు ఆరేళ్ళ మల్లిఖార్జున్ గౌడ్, బట్టి జగపతి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మెన్ లు ఆకిరెడ్డి క్రిష్ణారెడ్డి, గంగా నరేందర్, బిఆర్ఎస్ పార్టీ నాయకులు న్యాయవాది జీవన్ రావు, మెదక్ బిఆర్ఎస్ పార్టీ పట్టణ కన్వీనర్ గడ్డమీది క్రిష్ణా గౌడ్, మెదక్ పట్టణ బిఆర్ఎస్ పార్టీ కౌన్సిలర్ లు మామిండ్ల ఆంజనేయులు, జుబేర్ అహ్మద్, మాయా గంగమణి మల్లేశం, మ్యాదరి దీపక్ కుమార్, ఖాజా సోహేల్, సాయి, మాజీ కౌన్సిలర్ లు ప్రభురెడ్డి, కిషోర్, ఆర్.కె. శ్రీనివాస్ లతో పాటు బిఆర్ఎస్ పార్టీ నాయకులు లింగారెడ్డి, సయ్యద్ సాదిక్ అలీ లతో పాటు నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

నారాయణఖేడ్, ప్రజాజ్యోతి ఆగస్టు 15:





80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని నారాయణఖేడ్ పట్టణంలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. జహీరాబాద్ ఎంపీ సురేష్ కుమార్ షెట్కార్, నారాయణఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి, మున్సిపల్ చైర్మన్ నగేష్ కుమార్ షెట్కార్ తదితరులు వేడుకల్లో పాల్గొని పట్టణంలోని పలు కూడళ్లు, ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థల్లో జాతీయ పతాకాలను ఆవిష్కరించారు. గాంధీ చౌక్ వద్ద ఎంపీ సురేష్ కుమార్ షెట్కార్ జాతీయ జెండాను ఆవిష్కరించగా, కీ.శే. శివరావు షెట్కార్ విగ్రహం వద్ద మున్సిపల్ చైర్మన్ నగేష్ కుమార్ షెట్కార్ జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. కీ.శే. అప్పారావు షెట్కార్ విగ్రహం వద్ద యువనేత సాగర్ షెట్కార్ జెండాను ఆవిష్కరించారు. అనంతరం నారాయణఖేడ్ మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్మన్ జాతీయ పతాకాన్ని ఎగురవేశారు.పట్టణంలోని పలు ప్రధాన కూడళ్లు, ప్రభుత్వ కార్యాలయాలతో పాటు ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులు, ఉపాధ్యాయుల సమక్షంలో జెండా ఆవిష్కరణ కార్యక్రమాలు నిర్వహించారు. సబ్ కలెక్టర్ కార్యాలయంలో జరిగిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లోనూ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ సురేష్ కుమార్ షెట్కార్ మాట్లాడుతూ.. దేశ స్వాతంత్ర్యం కోసం సర్వస్వం త్యాగం చేసిన మహనీయుల త్యాగఫలమే నేటి స్వతంత్ర భారతదేశమన్నారు. ప్రజాస్వామ్య విలువలను కాపాడుకుంటూ దేశాభివృద్ధికి ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని పిలుపునిచ్చారు. గ్రామీణ ప్రాంతాల సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని తెలిపారు. విద్యార్థులు క్రమశిక్షణ, దేశభక్తితో ఉన్నత స్థాయికి ఎదిగి దేశానికి, ప్రాంతానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.అనంతరం మున్సిపల్ ఆధ్వర్యంలో తహసీల్దార్ గ్రౌండ్‌లో నిర్వహించిన ప్రధాన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో పాల్గొని గౌరవ వందనం స్వీకరించారు. ఈ కార్యక్రమంలో డీసీసీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ రెడ్డి, పీసీసీ సభ్యులు శంకరయ్యస్వామి, యువనేత సాగర్ షెట్కార్, స్థానిక ప్రజాప్రతినిధులు, మున్సిపల్ కౌన్సిలర్లు, మండల, పట్టణ స్థాయి అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, యువకులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని ఉత్సాహంగా జరుపుకున్నారు.

# విజేత హైస్కూల్‌లో ఘనంగా 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

నారాయణఖేడ్, ప్రజాజ్యోతి ఆగస్టు 15:

80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని నారాయణఖేడ్ పట్టణంలోని విజేత హైస్కూల్‌లో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రిన్సిపల్ ఎం. శ్రీనివాస్ రెడ్డి జాతీయ జెండాను ఆవిష్కరించి జాతీయ గీతాన్ని ఆలపించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ..దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడిన మహనీయుల త్యాగాలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని అన్నారు. స్వాతంత్ర్య సమరయోధుల ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని విద్యార్థులు క్రమశిక్షణ, దేశభక్తి, నైతిక విలువలతో ముందుకు సాగాలని సూచించారు. దేశ భవిష్యత్తు యువత చేతుల్లోనే ఉందని, విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఏర్పరచుకుని వాటి సాధనకు కృషి చేయాలని అన్నారు. అనంతరం విద్యార్థులు దేశభక్తిని చాటేలా దేశభక్తి గీతాలు ఆలపించడంతో పాటు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. విద్యార్థుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.



